
ఆంధ్రభూమి స్వర్ణోత్సవ కథల పోటీల్లో మూడవ బహుమతి గెల్చుకున్న కథ!

# ఓ(టి)టు షో



**ఆ** పల్లెటూళ్ళో ప్రవేశిస్తోంటే మాజీ యమ్మెల్యే నాంచారయ్య గుండెలు గుబగుబలాడాయి.

అప్పుడెప్పుడో అయిదేళ్ళ క్రితం ఆ ఊరొచ్చారు. కాలి నడకన ఇల్లిల్లూ తిరిగారు. తనని గెలిపిస్తే ఊరు రూపురేఖలు మార్చేస్తానన్నారు.

ఎలాగైతేనేం గెలిచారు. ఊరుని మర్చిపోయారు. అసలా ఊరు తన నియోజక వర్గంలో వుందన్న సంగతి గుర్తే లేదు!

కాలచక్రం గిర్రున తిరిగేసింది. మళ్ళీ ఎన్నికలొచ్చి పడ్డాయి. ఆ ఊరుని వెదుక్కుంటూ రాక తప్పింది కాదు.

పైగా పరిస్థితి మరింత తీవ్రమయ్యింది. ఇది వరకు ఒకడే ప్రత్యర్థి. ఇప్పుడు కొత్త పార్టీ తాలూకు మూడోవాడు ప్రవేశించాడు.

ఈ మూడు ముక్కలాటలో గెలుపెవరిదో!

నిట్టూర్చారు.

"ఏంటలా నీరుగారిపోతున్నారు. పాత ప్రామిస్సుల గురించి నిలదీస్తారనా! ఊహూ. మన ఓటర్లకు మతి మరుపు ఎక్కువ. బహు మర్యాదస్తులు కూడానూ. అంచేత ఎలాంటి దెప్పుళ్ళకీ దిగరు గాక దిగరు. అదీగాక వీళ్ళొట్టి పల్లెటూరి బగ్గిరాయిలు. ఇట్టే బోల్తా కొట్టించి బుట్టలో వేసేసుకోవచ్చు" కేంపెయిన్ మేనేజరు మరియు యమ్మెల్యే గారి కుడిభుజమూ అయిన అప్పారావన్నాడు.

"ఊరి బాగుకోసం ఏదైనా చేసుండాల్సిందయ్యా...'

"దీన్నే ఎన్నికల వైరాగ్య అంటారు. ఎలక్షన్ టైంలో ఏవేవో ఆలోచన్లు వస్తాయి. రిజల్ట్స్ ప్రకటించగానే పత్తా లేకుండా పోతాయి!"

"అయితే ఊరి వాళ్ళెవరూ నిలదీయరంటావు?"

"వుహూ...అసలా వూసే ఎత్తరు. ఒకవేళ ఎత్తుదామని నోరు తెరిస్తే నోట్లోంచి మాట రాకుండానే మనం వాగ్దానాలు గుప్పించేస్తాం. మన చేతికి ఎముక వుంది గాని నాలిక్కి నరం లేదు కదా!" నవ్వేడు అప్పారావు.

"సరే కానియ్. ఏదో దారి దొరక్కపోద్దేంట్లే..."

పది సుమోలు, ఇరవై బైక్‌లు, అరవై మంది జనంతో అట్టహాసంగా ఊళ్ళో ప్రవేశించారు.

జనం వారిని పట్టించుకోలేదు. పోగవ్వలేదు. స్వాగతాలసలే లేవు!

ఫ్యాక్షన్ సినిమాల్లోని దృశ్యాలు గుర్తొచ్చాయి నాంచారయ్యకి.

"మనవంటే జనం భయపడతన్నారంటావా?"

"అదేమోగాని భక్తిపట్టం లేదని రూఢిగా చెప్పగల్ను" సిగరెట్టు దమ్ము గట్టిగా పీలుస్తూ

అన్నాడు.

'జై'లు, 'జిందాబాద్'లు కొట్టింది అనుచరగణం. జనం అయిపు లేకపోయేసరికి నోళ్ళకి తాళాలు వేసుకుని ఒగురుస్తూ దిక్కులు చూడసాగారు.

చెట్ల మీద తిష్ఠ వేసిన కాకులు కూడా కదలక పోవడం చాలా అవమానంగా అన్పించింది యమ్మెల్యేగారికి.

బుర్ర గోక్కున్నారు. చుండ్రు రాలింది.

"ఎగస్పార్టీ వోళ్ళు కొనేసినట్టున్నారండి" ఒక అనుచరుడన్నాడు.

"నోర్ముయ్యహె అపశకునప్పక్షీ! తిన్నగా సర్పంచింటికి పోనివ్వరా"

"ఎటెల్లాలండి."

"నాకు మాత్రం తెల్సేంటి. ఎవుడొకడ్ని అడగండ్రా..."

దారిపొడవునా అడుక్కుంటూ, పొలోమంటూ ఊరి చివర్న వున్న సర్పంచి ఇంటికెళ్ళేరంతా.

కుక్కలు వారిని చూసి భయపడి అల్లంత దూరం వెళ్ళి మొరగ సాగాయి.

బొడ్డు చుట్టూ చేసే ఇంజెక్షన్లు గుర్తొచ్చాయి. దెబ్బకి అంతా మౌనీశ్వరులై భయం భయంగా చూడసాగారు.

సర్పంచి గబగబా ఇంట్లోంచి వచ్చాడు. దండాలు పెట్టి ఆహ్వానించాడు. ఇంటి ముందు ఆరుబయట కూర్చోడానిగ్గాను నులక మంచాలు వేయించి మజ్జిగ ఇచ్చి మర్యాద చేశాడు.

ఊపిరి పీల్చుకున్నారు నాంచారయ్య. ధీమా చిక్కింది.

"ఇవాళ ప్రచారానికొస్తామని కబురంపేం గదా. హడావుడేం లేదేంటి?"

"మా వూరోళ్ళమంతా ఒక కట్టుబాటు పెట్టుకున్నావండి..."

"ఏవఁనుకున్నారు?" కీచు స్వరంతో అడిగారు.

"ఓటుకి అయిదొందలు కావాలనా?" తోలు బేగ్గు మీద చెయ్యేస్తూ అడిగాడు అప్పారావు.

"అబ్బే. అమ్ముడయ్యేవోళ్ళం గాదండి. మా సంగతి ఎమ్మెల్యే గోరికి తెలుసు.."

"అసలు సంగతేంటో త్వరగా చెప్పరా మగడా!" బీపీ పెరిగిపోతోంటే అన్నారు నాంచారయ్య.

"అన్నీ తెలిసినోరు. తవఁరికి తెలీందేవుందండి. అటు భీమవరం ఇటు గుడివాడ– అదీ ఇదీ ఏంటండి అన్ని టౌన్లకీ సినిమా యాక్టర్లొస్తున్నారు. ఒకో చోటకి అయిదారుగురొస్తు న్నారు. మా వూరి వంక ఒక్కరంటే ఒక్కరు కన్నెత్తి చూట్టం లేదండి. మేం తక్కువ తిన్నామాండీ?"

చింకి చేటంత మొహం చేసుకుని నవ్వేశారు నాంచారయ్య.

"ఓస్ అదా మీ బాధ! మీ ఊరికి పెద్ద సినిమా యాక్టర్ని తీసుకొస్తాను. మీ ఊరి ఓట్లన్నీ ఒక్కటి కూడా బీరు పోకండా నా మీదే గుద్దెయ్యాలి మరి..."

"ఆయ్. అలాగే గుద్దేత్తావండి. ఊరోళ్ల తరపున మాటిత్తన్నానండి. తవరి మాటకేమోగాని మా మాటకి తిరుగుండదండి..."

"ఊరికేదో చెయ్యండి లేదా ఊరికోసం ఇంత సొమ్మివ్వండి - అన్నవాళ్ళని చూశాను గాని సినిమా స్టార్లని తీసుకురమ్మన్న వాళ్ళని మిమ్మల్నే ఇదిగో ఇప్పుడే చూస్తున్నానోయ్" బొజ్జ అదిరేలా నవ్వేరు.

అనుచరులూ ముసిముసి నవ్వులు కురిపించారు.

"ఇంకో సంగతండి. సినిమా వోళ్ళు ఇలా వచ్చి చెయ్యూపి అలా ఎళ్తే గాదండి మరి. ఒక పూట మా వూళ్ళో వుండాలండి. మాతో మాట్లాడాలండి..."

"అలాగలాగే. పొద్దుట్నుంచి సాయంత్రందాకా మీ ఊళ్ళోనే మకాం పెట్టిస్తాను. కావాలంటే షూటింగు కూడా చేయిస్తాను. మీ ఓట్లు మాత్రం నాకే. నాకంటే నాకే..."

"పగలు పనులకి పోతావండి. సినిమావోళ్ళు వత్తన్నారన్చెప్పి పనికి నాగా పెట్టలేం గదండి. యవసాయప్పనుల గురించి తవరికి తెల్సుకదా. ఎప్పుడేం చెయ్యాలంటే అది చెయ్యాలండి. లేపోతే పంట సంక నాకి పోద్దండి..."

"భలేవోడివి. నాకెందుకు తెలీదూ. ఈమధ్యనంటే హైదరాబాదులో వుంటున్నాగాని ఇదివరకు ఈ ఏరియా వాడ్నే గదా. సరేనయ్యా. ఇంతగా అడుగుతున్నావు గనుక రాత్రిపూట తీసుకొస్తాను. మీరంతా తీరిగ్గా తనివి తీరా స్టార్లని చూసి ఓటు నాకెయ్యాలి- నాకే వెయ్యాలన్న మాట!"

"అలా ఆళ్ళ మొహాల్ని చూట్టం ఇలా తవరి మొహం మీద-అదేనండి తవరి గుర్తు మీద ముద్దరేసెయ్యడం. మాటంటే మాటే గానండి సిన్న తిరకాసుందండి..."

"వాళ్ళచేత రికార్డింగు డాన్సాడించాలా? అలాగే కానిచ్చేద్దాం..."

"అంత పనొద్దు కానండి, మిగతా వోళ్ళు తవరికన్నా ముందు సినిమా వోళ్ళని తీసుకొత్తే మూకుమ్మడిగా మా ఓట్లని ఆళ్ళకి గుద్దేత్తావండి. ఆనక చెప్పలేదనొద్దండి..."

"వాళ్ళూ మేవూ ఒకే రోజున తీసుకొస్తే?" అప్పారావు లా పాయింటు లాగాడు.

"ఎవరు పెద్ద యాక్టర్ని తీసుకొత్తే ఆళ్ళకే మా ఓట్లు!"

"అలా జరగనివ్వన్లే. రెండ్రోజుల్లో పేద్ద యాక్టర్లని తీసుకొచ్చేస్తాను. మీరంతా మాట మీద నిలబడాలి సుమా..."

"మేం నిలబడేది భూమ్మీదా, మాట మీదానండి. మేం నమ్మేది ఆటిల్నేనండి. గ్యాసు కబుర్లు మాకు తెలవ్వండి..."

"నాకు తెల్సు నాకు తెల్సు. వస్తానోయ్. కొన్ని జెండాలూ పోస్టర్లూ వుంచు..."

"ఎందుకండీ దండగ! యాక్టర్లని తోలుకొచ్చి ఓట్లు దండుకు పోండి"

"ఓకే ఓకే. వస్తానోయ్. నీ పేరేంటి?"

"ఓటర్నండి."

"భలే జోకేశావోయ్. వస్తానోయ్. రెండ్రోజుల్లో మీ ఊరి పేరు టీవీలో పేపర్లలో మారు మోగి పోద్ది చూడండి..."

పటాలం కదిలింది.

"ఆ సర్పంచి గట్టి పిండంలా వున్నాడు. పెద్ద ప్రామిస్సు చేశారు. శానా ఖర్చవుద్ది..."

"అవ్వనీయ్. గ్యారంటీగా 2043 ఓట్లు నా పెట్టెలో పడతాయి కదా. ఓటు విలువ నాకంటే బాగా ఎవుడికీ తెలీదొరేయ్. క్రితంసారి గుర్తుందా? ఒకే ఒక్క ఓటుతో గెలిచాను. అహ నాకు ఒక్క ఓటే పడిందని కాదు, ఒక్క ఓటు మెజార్టీతో గెలిచేను. రెండంటే రెండు ఓట్లు అటై వుంటే జన్మలో అసెంబ్లీలో అడుగుపెట్టే వోడ్ని కాదొరేయ్..."

మారు మాట్లాడలేదు అప్పారావు.

వెంటనే హైదరాబాద్ ఫోన్లు వెళ్ళాయి. ఆ వెంటనే అక్కడి ప్రొడక్షన్ మేనేజర్ల దగ్గరకీ ప్రొడ్యూసర్ల దగ్గరకీ మనుషులెళ్ళారు.

సినీ నటుల కోసం జల్లెడ పట్టారు.

చాలా మంది సినిమా షూటింగులకీ ఎన్నికల ప్రచారానికీ కాల్షీట్లిచ్చేశారు.

'గండం గడిచేదెట్లారా దేవుడా!' అని నీరుగారి పోతుంటే, "షూటింగు–ఐమీన్ మీటింగు హైదరాబాదులో పెట్టుకుంటే కాల్షీట్ ఇస్తాను" అందో వర్ధమాన నటి.

"నీ కోసం ఊర్ని ఇక్కడికి తేలేం తల్లీ" అని దండం పెట్టేశారు.

చెన్నై, ముంబైలలో కూడా గాలించారు. ఎలక్షన్ సీజనవడంతో ప్రతీచోటా యాక్టర్లకి గిరాకీ వచ్చేసింది. ముఖానికి మేకప్పు వేసుకుని ఏడాదైనవాళ్ళని కూడా విమానాల్లో తీసుకుపోతున్నారు.

కడకి రెండు తెలుగు సినిమాల్లో క్లబ్ డాన్సులు చేసిన ముంబాయి తారనీ, ఓ 'బుడ్డి' తెలుగు కమెడియన్నీ 'బుక్' చేశారు.

మారుమూల పల్లెకు వస్తున్నందుగ్గాను అదనంగా కొంత ముట్టచెప్పడానిక్కూడా అంగీకరించారు.

'రాజు వెడలె రవి తేజములలరగ...' అంటూ నాంచారయ్య, సినీ తార, కమెడియన్, వందిమాగధులు, అభిమానులు వివిధ వాహనాల్లో భీమవరం నుంచి బయల్దేరారు.

ఎందుకైనా మంచిదని ఆరింటికే చికెన్ బిర్యానీలూ ప్రాన్‌రోస్టులూ క్యాజూ ఫ్రైలూ సుష్టుగా భీమవరంలోనే పెట్టించేశారు.

గతుకుల రోడ్డు. కాలువ ప్రక్క నుంచి ఎగిరెగిరి పడ్తూ వెళ్తున్నాయి వాహనాలు. రోడ్డు ప్రక్క లైట్లు ఒక్కటీ వెలగట్లేదు.

కాస్త అదుపు తప్పితే చాలు కాలువలో మునగటం ఖాయమనుకుంటూ ఉగ్గబెట్టుకుని కూర్చున్నారంతా.

"పశువులు కూడా ఈ రోడ్డు మీద నడవ లేవు" వ్యాఖ్యానించాడు తెలుగు కమెడియన్.

"ఇదంతా మీ ఆంధ్రాలోదేనా! ఇంత పూర్‌గా ఉందేవిటి!" ముంబాయి తార ఇంగ్లీషులో అడిగింది.

సంచుల్తో డబ్బు తీసుకుని ముంబాయి వచ్చే నిర్మాతల్ని చూసి చూసి ఆంధ్రాలో డబ్బు పండుతుందనుకుంటోందామె!

ఆమె తల్లి హిందీలో ఏకధాటిగా తిడుతోంది-రోడ్డునీ ప్రయాణాన్నీ బుక్ చేసిన వార్నీ!

కాలువని వదిలి మరో ప్రక్కకు మళ్ళాయి వాహనాలు.

చిమ్మ చీకటిలో పరుగెడుతున్నాయి.

హర్రర్ సినిమాల్లోని నేపథ్య సంగీతం గుండెల్లో ప్రతిధ్వనిస్తోంటే లోలోపలే తిట్టుకోసాగారు.

మొత్తానికంతా క్షేమంగా ఆ ఊరు చేరారు.

'హమ్మయ్య' అనుకున్నారు.

రోజూ ఆ రోడ్డు మీద ఆ వూరి వాళ్ళెలా రాకపోకలు సాగిస్తున్నారో అన్న ఆలోచనెవరికీ రాలేదు.

నాంచారయ్యకి ముందే రాలేదు. మరో అయిదేళ్ళదాకా ఆ ఊరి ముఖం చూడక్కర్లేదని భరోసా ఇచ్చుకుంటున్నారు.

చీకట్లో నిండా మునిగి వుందా ఊరు.

పాక బడి ముందున్న భారీ ప్రదేశంలో వాహనాలు ఆగాయి.

ఫ్లడ్ లైట్లు 'వెలుగు'ని తీసుకొచ్చాయి.

అప్పటికప్పుడు బడిలోని బెంచీలు తెచ్చి వేసి 'వేదిక' ఏర్పాటు చేశారు అనుచరులు.

ఊరి జనం తరలి వచ్చారు. వారిని చూసి, మళ్లీ ఎమ్మెల్యే అయిపోయినట్టు పొంగిపోయారు నాంచారయ్య.

సర్పంచినీ ఊరి ప్రముఖుల్నీ కావలించుకున్నారు. యువకుల్ని ప్రత్యేకంగా పొగిడారు. ఓట్లు అర్థించారు. ఒట్లు వేయించుకున్నారు.

మహదానంద పడిపోతూ వేదికెక్కి ఆ ఊరిని పులివెందుల చేసేస్తాననేశారు నాంచారయ్య.

"పులివెందుల వైభవము వివరింపుడు" అని ఓ యువకుడు కోరాడు.

దాంతో అరగంట వర్ణించారాయన. శోష రాబోతోంటే ఇంకో యువకుడు గ్లాసుతో నీళ్ళు తీసుకొచ్చిచ్చాడు.

సగమే త్రాగారు. కడుపులో తిప్పినట్టయ్యింది. ఊసేశారు. ఆ వెంటనే వాంతి చేసుకున్నారు. పాపం భీమవరం బిర్యానీ కాస్తా బయటికొచ్చేసింది.

"ఈ దరిద్రపు నీళ్ళెక్కడ దొరికాయిరా?" కోప్పడ్డారు.

"మా ఊరి చెరువులోవేనండి. ఒట్టండి..."

మిర్రి చూసి, ముఖం ముడుచుకుని, అప్పారావు వంక చూడగా అతడు మినరల్ వాటర్ బాటిల్ అందిచ్చాడు.

వేదిక ప్రక్కన కమెడియన్ ఊరి కుర్రాళ్ళతో మాట్లాడుతూ "ఇక్కడ విప్పసారా దొరుకుతుందా" అని ఆరా తీశాడు.

"నాటు సారా ఫుల్లుగా దొరుకుద్ది" అన్నారు వాళ్ళు.

"హైబ్రిడా? బావుంటుందా?"

"బ్రహ్మాండం. సర్కారు వారి అమృతమా మజాకా!"

ఇంతలో సినీ తార మేకప్ వేయించుకుని వేన్ లోంచి దిగింది. ఆమె వెనుక ఆమె తల్లీ మరో అమ్మాయీ వచ్చారు.

తారని జనానికి పరిచయం చేశారు నాంచారయ్య. మీకోసం ప్రత్యేకంగా ముంబాయి నుంచి విమానంలో రప్పించానని గొప్పగా చెప్పారు. మీ ఆనందం కోసం ఏమైనా చేస్తాననడానికిది మచ్చుతునక మాత్రమే అనీ అన్నారు.

పిమ్మట ఆమెని నాలుగు మాటలు మాట్లాడమని కోరారు.

తార కళ్ళూ, చేతులూ తిప్పుతూ పెదాలు కదిలిస్తోంటే, ఆమె వెనుక నిలబడ్డ అమ్మాయి 'డబ్బింగ్' చెప్పింది.

"మీ అందరికీ నమస్కారాలు. నా ఫాన్స్ అందరికీ స్పెషల్ థాంక్సు. నేనింకా తెలుగులో చాలా సినిమాలు చేస్తున్నా. అన్ని భాషల్లో బోల్డు సినిమాల్లో యాక్టు చేస్తున్నా. బిజీ తారని. మిమ్మల్ని కల్సుకోడానికి వచ్చాను. నా సినిమాలన్నీ మళ్ళీ మళ్ళీ చూడండి. నన్ను టాలీవుడ్ నెంబర్ వన్‌ని చెయ్యండి. వణక్కం. సారీ – నమస్కారం..."

డబ్బింగ్ ఆగింది. ఆ సంగతి గ్రహించని తార మరి కాస్సేపు మూగాభినయం చేసి చేతులు జోడించింది.

ఓట్ల గురించీ తన గురించీ ఏమీ చెప్పనందుకు నొచ్చుకున్నారు నాంచారయ్య. అసహనంగా డబ్బింగ్ ఆర్టిస్ట్ వంక చూశారు. తారతో ఏదో చెప్పేరు. అర్థంగాక ఆమె తల్లి వంక చూసింది.

"ఇక్కడేం బావో లేదు, ఏర్పాట్లూ బాగోలేదు" అందామె హిందీలో, ముఖం చిట్లించి మరీ.

ఇంతలో 'హమ్మో' అని అరుస్తూ చెంప మీద కొట్టుకుంది తార.

"మస్కిటోస్ మస్కిటోస్...!" పరుగునెళ్ళి ఏసీకార్లో దూరింది.

"డాక్టర్ కో బులావో..." అంటూ తారతల్లి చిందులేసింది గాని ఎవరూ పట్టించుకోలేదు.

తిడుతూ వెళ్ళి కారెక్కేసింది.

కమెడియన్ తూలుతూ స్టేజి మీదకి వచ్చాడు.

"మీ ఊరు నచ్చింది. మీ ఊరి స్పెషల్ సరుకు నచ్చింది. మీరెప్పుడూ ఇలా పచ్చగా వుండాలంటే వీడికే సారా సారీ–మీ పేరేంటి?...నాంచారయ్య వీపు మీద ఒకటేయండి – మళ్ళీ సారీ ... సారీ – వీడి గుర్తు మీద ఓటేయండి..." చెబుతూనే కూలబడిపోయాడు.

అప్పారావూ మరి కొందరూ కలిసి అతడ్ని తీసుకెళ్ళి కార్లో కూలేశారు.

ఇక్కడింకో క్షణంవుంటే మలేరియా వచ్చేస్తుంది, చికెన్ గున్యా వచ్చేస్తుంది – ఆవటాని సినీ తార చిందులు తొక్కింది.

ఆమెనీ, ఆమె తల్లినీ, డబ్బింగ్ ఆర్టిస్ట్‌నీ భీమవరం పంపేశారు.

స్టేజి మీద నాంచారయ్య దొరికేసిన దొంగలా వుండి పోయాడు. బెదురు చూపులు చూస్తూ, నీళ్ళు నములుతూ, గుటకలు మ్రింగుతూ చూశారు. ఏం చెప్పాలో తోచలేదు. యుద్ధభూమిలో తనొక్కడూ ఆయుధరహితంగా మిగిలిపోయినట్టుగా వుందాయనకి.

సర్పంచి తదితరుల వంక ఇబ్బందిగా చూశారు.

వారంతా ఆయన్నే చూస్తున్నారు. కానొక్కరూ పెదవి విప్పటం లేదు.

చీకటిని చీల్చుకుని మరీ వచ్చి గుండెల్ని ప్రశ్నిస్తోన్న వారి చూపుల బాణాల్నుంచి తప్పించుకోడానికి పరుగులాంటి నడకతో వెళ్ళి కారెక్కేశారు నాంచారయ్య.

కార్లు హడావిడి చేస్తూ వెళ్ళిపోయాయి.

ఊరు స్తబ్దు అయిపోయింది. వేసిన చోటే వుండే గొంగళిలా వుండిపోయింది!

* * *

**(ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం. 7-2-2010)**